ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5**
శనివారం 6 జూలై 2024



నీట్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలి 7లో
మొక్కలను కన్నబిడ్డల్లా కాపాడుకోవాలి 8లో

ధరల నియంత్రణ ఏదీ?

- పత్తాలేని పర్యవేక్షణ కమిటీ
- నిత్యావసరాల రేట్లు పెరుగుతున్నా, కరువైన పట్టింపు
- లబోదిబోమంటున్న పేద, మధ్య తరగతి ప్రజలు



జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరల నియంత్రించడానికి ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కమిటీ పత్తా లేకుండా పోయింది. ఒక వైపు నిత్యావసరాల రేట్లు పెరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. రోజు రోజుకూ పెరుగుతున్న ధరలు చూసి నిరుపేద, మధ్య తరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. నిత్యావసర ధరలు ఆకాశన్నంటితే వాటిని నియంత్రిచడంతో పాటు ప్రభుత్వ పరంగా విక్రయిస్తూ ప్రజలను ఆదుకోవాలి. ఇందుకు ధర ల పర్యవేక్షణ కమిటీ ఉన్నా ప్రస్తుతం ఆ ఊసేలేదు. జిల్లా లో పనితీరు అంతంతమాత్రంగానే ఉంది. ఇది ఉందనే విషయం దాదాపుగా అధికారులే మరిచి పోయారన్నట్లుగా కనిపిస్తోంది. బయటి మార్కెట్లో బియ్యం, పప్పులు, కూరగాయలు తదితర వస్తువుల ధరలు ఒక్క సారిగా పెరి గాయి. ఈ నేపథ్యంలో కమిటీ అత్యవసర సమావేశం నిర్వ హించి నియంత్రణపై దృష్టి సారించాల్సి అవసరముంది.

మండుతున్న ధరలు..

ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు విపరీతంగా ఉన్నాయి. కిలో టమాల రూ. 100 దాటింది. ఏ కూరగాయ కొనుగోలు చేసినా కిలో రూ. 80 కిపైగా పలుకుతోంది. దీంతో ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు జంకుతున్నారు. బీపీటీ బియ్యం క్వింటాలుకు రూ. 5,000 నుంచి రూ. 5,500, హెచ్ఎంటీ రూ. 5,500 నుంచి రూ. 5,800 వరకు, జై శ్రీరాం రూ. 6 వేల నుంచి రూ. 6,500 వరకు విక్రయిస్తున్నారు. బియ్యం నాణ్యతను బట్టి వ్యాపారులు ధర అమాంతం పెంచేస్తున్నారు. ఈ ధరలు దాదాపుగా రెండు నెలల నుంచి పెరుగుతూనే వస్తున్నాయి. నియంత్రణ లేకపోవడంతో వచ్చే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు చెబు తున్నారు. కంది పప్పు, ఇతర పప్పుల ధరలూ మండిపోతున్నాయి.

పట్టింపు లేదు...

నిత్యావసర ధరలు ఎక్కువగా ఉన్నాయి. సామాన్య ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ధరల పర్యవేక్షణ కమిటీ దాదాపుగా గత ఏడాది నుంచి సమావేశాలు నిర్వహించడం లేదు. ఒక వేళ నిర్వహించినా కాగితాలకే పరిమితమవుతోంది. కమిటీ గురించి ఎవరికీ పట్టింపు లేకుండా పోయింది. పెరుగుతున్న ధరలను నియంత్రించడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో టామాట కిలో ధర దాదాపుగా సెంచరీకి చేరింది. బియ్యం క్వింటాలు ధర రూ. 6 వేల నుంచి రూ. 6,500 వరకు పలుకుతున్నాయి. ఇంత ధరలు పలుకుతున్నా అధికార యంత్రాంగం ఏ మాత్రం దృషి సారించకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

నిత్యావసర వస్తువుల ధరలు మండుతున్నాయి

అడిగొప్పుల రజిని, గృహిణి, జగిత్యాల



ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. కూరగాయల ధరలతో పాటు బియ్యం, పప్పుల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. అధికారులు ధరల నియంత్రణపై దృష్టి సారించాలి.

కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి: కంబ శంకర్, జగిత్యాల



లాభాలను ఆశిస్తున్న పలువురు వ్యాపారులు అకారణంగా పలు నిత్యావసర వస్తువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి పలు వస్తువులను బ్లాక్ చేస్తున్నారు. ధరలను పెంచి మళ్లీ మార్కె ట్‌లోకి తెస్తున్నారు. ప్రధానంగా బియ్యం వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు.

కమిటీ చైర్మన్‌గా కలెక్టర్...

ధరల పర్యవేక్షణ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా పౌర సరఫరాల అధికారిగా వ్యవహరిస్తారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, ఉద్యాన శాఖ, మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల సంస్థ డీఎం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు నిత్యావసర సరుకులతో సంబంధం ఉన్న అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ కమిటీ ప్రతి నెల సమావేశం నిర్వహించాలి. ప్రస్తుతం ఉన్న ధరలు, విక్రయాలపై చర్చించాల్సి ఉంటుంది. వ్యాపారులు కృతిమ కొరత సృష్టించి సరుకులు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలి. ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటే ప్రభుత్వ పరంగా కేంద్రం ఏర్పాటు చేయించి ప్రజలకు సరకులు విక్రయించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

దివ్యాంగులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోంది



మాట్లాడుతున్న దివ్యాంగ సంఘ నాయకులు

జగిత్యాల అర్బన్, జూలై 5: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక దివ్యాంగులను విస్మరిస్తోందని దివ్యాంగ సంఘ బాధ్యులు విమర్శించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మెనిఫెస్టోలో పెట్టిన విధంగా దివ్యాంగులకు, మహిళలకు, ట్రాన్స్‌జెండర్‌లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పి, కేవలం సకలాంగులైన మహిళలకే ఈ అవకాశం కల్పించి దివ్యాంగులను విస్మరించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దివ్యాంగులకు రూ. 6వేలు పెన్షన్ అందిస్తామని హామీఇచ్చిన అమలు కాలేదని, ఇదివరకు వచ్చే రూ.4016 పెన్షన్ సమయానికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రకటించిన విధంగా రూ.6వేల పెన్షన్‌ను అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దివ్యాంగ సంఘ బాధ్యులు లంకదాసరి శ్రీనివాస్, మహ్మద్ అజ్జర్ అలీ, గౌరిశెట్టి చంద్రశేఖర్, అవునూరి గంగారాం, ముత్తనూరి మహేష్, సత్యనారాయణ తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా నియామకమైన కలెక్టర్ సత్య ప్రసాద్‌ను శుక్రవారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్ కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో సిగ్నేచర్ క్యాంపెయినింగ్

కొడిమ్యాల, జూలై 5 : దేశ విద్యా రంగాన్ని అబాసుపాలు చేస్తున్న మోదీ నీట్ స్కాంపై సమగ్ర విచారణ, రీ ఎగ్జాం జరిపించాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రీ నీట్ ఎగ్జాం సేషన్‌కు సపోర్ట్‌గా మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయులో శుక్రవారం విద్యార్థులతో సిగ్నే చర్ క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు తాళ్ల దిలీప్, జగిత్యాల సెక్రటరీ యాల్ల అభిషేక్‌రెడ్డి, మల్యాల, గంగాధర మండలాల అధ్యక్షులు కోరెపు వెంకటేష్, నమంతుల శేఖర్, నాయకులు పడాల అభిలాష్, తాళ్ళ రాకేష్ పాల్గొన్నారు.

చెట్లను నరికే వారిపై కఠిన చర్యలు

కలెక్టర్ సత్యప్రసాద్



కల్లెడలో మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, జూలై 5 : నాటిన మొక్కలను నరికివేసే వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరా వన మహోత్సవ కార్యక్రమాన్ని జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ గ్రామంలోని ఫారెస్ట్ ఏరియాలో శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో ఫారెస్ట్ ఏరియాలో ఇందిరా వన మహోత్సవం కార్యక్రమం సందర్భంగా 45 లక్షల మొక్కలను జిల్లాకు టార్గెట్‌గా నిర్ణయించామని తెలిపారు. శుక్రవారం వెయ్యి మొక్కలు నాటామని, గతంలో 5 లక్షల మొక్కల నాటడం జరిగిందని, 15 లక్షల మొక్కలకు పిట్టింగ్ పూర్తి అయిందని అన్నారు. ఆగష్టు లోగా టార్గెట్ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మొక్కలను నామ మాత్రంగా కాకుండా నాణ్యమైనవిగా మొక్కలను రక్షించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లెక్క కోసం మొక్కలు నాటడం కాకుండా వాటి పర్యవేక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అన్నిశాఖల వారిని భాగ స్వామ్యం చేసేందుకు ఇప్పటికే పాఠశాల విద్యార్థులు, అధికారులచేత మొక్కలు నాటించామని తెలిపారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ గ్రామంలో మహిళ స్వశక్తిసంఘసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళాశక్తి కుట్టు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ రఘువరణ్, ఆర్డీవో మదుసూధన్, డీఆర్‌డీఏ పీడీ వినోద్, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ రాంమోహన్, ఎంపీడీవో రమాదేవి, ఏపీఎం గంగాధర్, ఎంపీఓ రవిబాబు పాల్గొన్నారు.

కళాశాల తిరిగి ప్రారంభించాలని జీవో జారీ

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 5: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు 60 ఏళ్ల చరిత్ర కలిగి ఉన్న ఈ కళాశాల గత పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల మూత బడిందన్నారు. ఇక్కడ చదువుకున్న రోజుల్లో ఎంతో మంది విద్యార్థులు పెద్ద పెద్ద హోదాలో ఉన్నారన్నారు. కళాశాల మూసి ఉండటం చాలా బాధ అనిపించిందని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత స్థానిక రాజకీయ నాయకులు ఈ కళాశాలను తిరిగి తెరిపించాలని తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, హయ్యర్ ఎడ్యుకేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కలెక్టర్, ఉన్నతాధికారుల చొరవతో కళాశాల తిరిగి ప్రారంభం అయిందన్నారు. తాను ఇచ్చిన మాటను వంద శాతం అమలు చేయడానికి శాయ శక్తుల ప్రయత్నిస్తానని ఆయన అన్నారు. కళాశాల భవన మరమ్మ తు, ఇతర అవసరాల నిమిత్తం ఏసీడీపీ ఫండ్ నుంచి రూ 5 లక్షలు ఇస్తామని, ఇందుకు సంబంధించి అధికారులకు కూడ ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఈ కళాశాలను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కళాశాల తిరిగి ప్రారంభోత్సవంలో తనకు సహకారం అందించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్, హయ్యర్ ఎడ్యుకేషన్ అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జీవో కాపీని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌కు ఆయన చేతుల మీదుగా అందించారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

నియామకం



మల్లీశ్వరి

జగిత్యాల అర్బన్, జూలై 5: బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జగిత్యాల నియోజ కవర్గ అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన బండపల్లి మల్లీశ్వరీని నియమిస్తూ సంఘ రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాము లైనందుకు గాను ఈ నియమించడం జరిగిందన్నారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందన్నారు. సంఘ జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణకు మల్లీశ్వరీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం పట్ల రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అలిశెట్టి ఈశ్వరయ్య, నియోజకవర్గ అధ్యక్షులు రాంచందర్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిసిన ఫైర్‌స్టేషన్ ఎస్ఐ

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఫైర్‌స్టేషన్ ఎస్ఐగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కృష్ణకాంత్ శుక్రవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫైర్ స్టేషన్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా సాయిబాబా

గొల్లపల్లి, జూలై 5 : గొల్లపల్లి మండల ప్రత్యేకాధికారిగా సాయిబాబా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గొల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారిగా బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాంరెడ్డి, అధికారులు, సిబ్బంది ఆయనకు బొకే అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో సురేష్ రెడ్డి, ఏపీవో మర్రి వేణు, కార్యదర్శులు నక్క లక్ష్మన్, రాజకిషన్, తిరుపతి, వెంకటేశం, మహేష్, మణికంఠ తదితరులతో పాటు ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జగిత్యాలలో వాసవి ట్రస్ట్ ప్రతిభా పురస్కార్

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి గార్డెన్స్‌లో ఈనెల 7వ తేదీన జిల్లా ఆర్యవైశ్య విద్యా కుసుమాలకు ప్రతిభా పురస్కార్-2024 ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీవాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్, ప్రాజెక్టు కమిటీ కన్వీనర్ మైలారపు రాంబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. పదవ తరగతి, ఇంటర్‌లలో 2024 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన జిల్లా ఆర్యవైశ్య విద్యా కుసుమాలకు ప్రతిభా పురస్కార్ అందించనున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్య విద్యార్థులు, సంఘ నాయకులు, పలువురు అధికారులు, అనధికారులు హాజరుకాను న్నారన్నారు. ప్రతిభా పురస్కార్ కార్యక్రమాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేయాలి'

గొల్లపల్లి, జూలై 5 : ఎస్సీ వర్గీకరణ సాధన లక్ష్యంగా 29 ఏళ్ల క్రితం ఏర్పాటైనా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న గ్రామగ్రామాన ప్రతి మాదిగ గడప గడపకు ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి మాదిగల ఐక్యతను ప్రపంచానికి చాటాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు చెవులమద్ది రమేష్ మాదిగలకు పిలుపునిచ్చారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు 29వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉండాలని కోరారు. సీనియర్ నాయకులు నరేష్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి చొప్పదండి చంద్రయ్య, నాయకులు తిరుపతి, మహేందర్, మహేష్ పాల్గొన్నారు.

చేనేత, హస్త కళలను ప్రోత్సహించాలి

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి):చేనేత, హస్త కళలను ప్రతీ ఒక్కరు ప్రోత్సహించాల్సిన అవసరముందని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టౌన్ హాలులో చేనేత హస్తకళల ప్రదర్శన స్టాల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతీ ఒక్కరు సందర్శనను సందర్శించి, ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రేణుక, చాంద్ పాషా పాల్గొన్నారు.

పదవులతో సంబంధం లేకుండా ప్రజాసేవ చేయాలి

మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్



మాట్లాడుతున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పదువులు ఉన్న లేకున్నా అంతకు మించిన రెట్టింపు ఉత్సాహంతో ప్రజాసేవ చేయాలని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం పట్టణంలోని జడ్పీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు పాలన చేరువ చేయాలన్న తలంపుతో మాజీ సీఎం కేసీఆర్ నూతన జిల్లాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఇందులో భాగంగా నూతనంగా జగిత్యాల జిల్లాను ఏర్పాటు చేయడం, అందులో తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా తనకు అవకాశం దక్కడం అదృష్టంగా బావిస్తున్నానన్నారు. తనకు రాజకీయ జీవితాన్ని అందించిన జిల్లా ప్రజలకు, మాజీ సీఎం కేసీఆర్‌కు, సహకరించిన ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. తమ అయిదేళ్ల పదవీ కాలంలో తోడ్పాటును అందించిన జడ్పీటీసీ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని నమ్ముకున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తామన్నారు. ప్రజలకు సైతం నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కాలుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- ఇబ్బందులు పడుతున్న రైతులు


మరమ్మతుల కోసం తెచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

గంగాధర, జూలై 5: వానాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతులకు కరెంటు కష్టాలు తప్పడం లేదు. తరచూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో నారుమడులు తయారు చేసుకుంటున్న రైతులు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లతో మరమ్మతు కేంద్రాలకు పరుగెత్తుతున్నారు. గంగాధర మండలంలో ప్రధానంగా వ్యవసాయం బావులు, బోర్లకింద వరి, వివిధ పంటలు సాగుచేస్తారు. మండల వ్యాప్తంగా సుమారుగా 8,500 పైచిలుకు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. అయితే వీటికి వివిధ స్థాయిలను బట్టి 16,25,63,100 కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు గంగాధర మండల వ్యాప్తంగా 475 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. విద్యుత్ శాఖ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా 4 శాతం ట్రాన్స్‌ఫార్మర్లు నిల్వ ఉంచుతారు. కాలిపోయిన సమయంలో దానిని మరమ్మతులు జరపడం సమయం పడుతున్నందున రిజర్వులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులకు అందిస్తారు. గంగాధరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు షెడ్డు ఈ సారి తట్టుకోలేక పోతుంది. ఇటీవల లక్ష్మీదేవిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా గంగాధరలో లేకపోవడంతో రైతులు చొప్పదండి మండలం భూపాలపట్నం షెడ్డుకు 25 కిలోమీటర్ల దూరం నుంచి 10వేలు రవాణా ఖర్చులు పెట్టుకుని తెచ్చుకున్నారు.ఇప్పుడంతా లోటు కారణంగా వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేక పోతున్నామని విద్యుత్ అధికారులు అంటున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నెల రోజుల్లో 475..

తరచూ కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క నెలలోనే 475 కాలిపోయాయంటే రిపేర్‌లోపమా, లోవోల్టేజీ సమస్య అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రిపేర్ షెడ్డుకు వచ్చిన రెండు రోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకందించాల్సి ఉండగా ఈ సారి ఎక్కువగా కాలిపోవడంతో సాధ్యపడలేదని సిబ్బంది తెలుపుతున్నారు. దీనిపై కాలిదాస్,డీఈ(ఎంఆర్‌టీ)ని వివరణ కోరగా 80 శాతం లూజువైర్ల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతు న్నాయన్నారు. గాలి ఎక్కువగా వీయడం వల్ల వైర్లు ఒకదానికొకటి తాకి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు.

● **రైతులపైనే రవాణా భారం**

సీజన్‌లో కురుస్తున్న వర్షాలకు కరెంటు సమస్యలు ఎక్కువయ్యాయి. పలు సమస్యలతో ప్రతిసారి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన సమయంలో రైతులపైనే భారం పడుతోంది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆటో, ట్రాక్టర్ కిరాయికి తీసుకుని రిపేరు షెడ్డుకు పోవాల్సిందే. ప్రత్యేకంగా రిపేరు షెడ్డుకు వెల్లాల్సిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వినియోగిస్తున్న రైతులకు6 నుంచి 10 వేల ఖర్చు అవుతోంది.


నాణ్యత ప్రమాణాలను పరీక్షిస్తున్న అధికారులు

గ్రోమోర్ షాపులో చోరీ

- రూ. 38,476 అపహరించిన దుండగులు
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్

శంకరపట్నం, జూలై 5: శంకరపట్నం మండలం కేశవపట్నంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిని అనుకొని ఉండే కోరమండల్ ఇంటర్నేషనల్ మన గ్రోమోర్ ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో చోరీ జరిగింది. షాపు మేనేజర్ రాయిని సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రోమోర్ షాపులో గురువారం రాత్రి షాపుకు తాళం వేసి ఎవరింటికి వారు వెళ్లిపోయారు. శుక్రవారం ఎరువుల దుకాణం వద్దకు వచ్చి చూసేసరికి షటర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. వెంటనే కేశవపట్నం పోలీసులకు సమాచారం అందించారు. కేశవపట్నం పోలీసులు క్లూస్ టీమ్‌కు సమాచారం అందించగా, వారు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించారు. గురువారం ఎరువులు, పురుగుల మందులు అమ్మగా వచ్చిన రూ. 38,476 నగదు లాకర్‌లో ఉంచారు. రూ. 46,717 విలువ చేసే క్రిమిసంహారక మందులను దొంగలు దోచుకెళ్లారు. దు కాణంలో దాచిన లాకర్‌ను దుకాణం సమీపంలోని పొలాల వద్దకు ఎత్తుకెళ్లిన దుండగులు పగలగొట్టి అందులో దాచిన రూ. 38,476 నగదును దోచుకెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్లో చోరీపై ఫిర్యాదు చేసినట్లు సతీష్ తెలిపారు.

బాలిక ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

చందుర్తి, జూలై 5: చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం బండపల్లి గ్రామంలో కుమ్మరి శ్రీవాణి అనే బాలికను ఇంటి నిర్మాణం విషయంలో బాబు, చిరంజీవి, రవి వ్యక్తులు వేధింపులు చేయడంతో ఈ నెల 1న ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 3న మృతి చెందింది. ఈ సంఘటనపై తల్లి లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాబు, చిరంజీవి, రవిలపై కేసు నమోదు కాగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

మెట్‌పల్లి రూరల్, జూలై 5: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించిన నిల్వ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని రామలచ్చక్కపేట గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుకను మెట్‌పల్లికి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు తెలిపారు. గ్రామ శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. ట్రాక్టర్లు స్వాధీ నం చేసుకొని యజమానులపై కేసు నమోదు చేశామని వివరించారు. అవసరమైన వారు అనుమతులు తీసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో బాలిక ఆత్మహత్య

చందుర్తి, జూలై 5: చందుర్తి మండలం కొత్తపేట గ్రామంలో అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ బాలిక శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం ఊరడి వెంకటి - పుష్ప దంపతుల కుమార్తె మహేశ్వరి(16) 15 రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. చికిత్స తీసుకున్నప్పటికీ నయం కాకపోవడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌండ్ పొల్యూషన్‌పై కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూలై 5: కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు కరీంనగర్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి సౌండ్ పొల్యూషన్‌కు కారణమైన వాహనాలపై కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ధ్వని కాలుష్యానికి కారణమైన జిల్లెల్లకు చెందిన మణివర్మన్ కేటీఎం మోటార్ సైకిల్, కామెల్లి శ్రావణ్‌కు చెందిన రాయల్ యన్‌ఫీల్డ్ బైక్, బోద అంజికి చెందినా రాయల్ యన్‌ఫీల్డ్ వాహనాలు స్వాధీనం చేసుకొని కొత్త న్యాయ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్ తెలిపారు. వాహనాలకు సైలెన్సర్‌లు మార్చి ధ్వని కాలుష్యానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాదకరంగా మూలమలుపు


చిన్నముల్కనూర్ నుంచి పీచుపల్లికి వెళ్లే రోడ్డు మూలమలుపు

చిగురుమామిడి, జూలై 5: మండలంలోని చిన్నముల్కనూర్ నుంచి పీచుపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో గ్రామం చివరన ఉన్న ములమలుపు ప్రమాదకరంగా మారిందని రెండు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వారు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో ఒక్కటైన కుటుంబం

● తల్లి మృతి.. జైలులో తండ్రి ● 14ఏళ్లుగా అనాథాశ్రమంలో పిల్లలు

● ఖైదీల విడుదలతో పిల్లల చెంతకు చేరిన తండ్రి



తండ్రికి పిల్లలను అప్పగిస్తున్న స్పందన నిర్వాహకుడు వీరస్వామి

జమ్మికుంట రూరల్, జూలై 5: సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ఆ కుటుంబంలో కొత్త కాంతులను నింపింది. తల్లిదండ్రుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో తల్లి మృతి చెందింది. ఇందుకు కారకుడని తండ్రిపై కేసు నమోదు కావడంతో కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. దీనితో వారి పిల్లలు ఒంటరి వారయ్యారు. ఆలనా పాలనా చూసే వారు కరువవ్వడంతో ఇద్దరు పిల్లలు పద్నాలుగేళ్లుగా అనాథాశ్రమంలోనే పెరిగారు. ఈ నెల 4న సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను ప్రభుత్వం విడుదల చేయగా పిల్లలు జైలునుంచి వచ్చిన తండ్రి చెంతకు చేరారు. వివరాలు ఇలా ఉన్నాయి.

జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామ సారయ్య క్షణికావేశంలో భార్య సత్తమ్మను నెట్టగా ప్రమాదవశాత్తు మరణించింది. ఈ సంఘటన 2010సంవత్సరంలో జరిగింది. న్యాయస్థానం సారయ్యకు యావజీవ శిక్ష విధించింది. అప్పుడు వారి కుమార్తె పూజకు 5సంవత్సరాలు, కుమారుడు బన్ని 4సంవత్సరాల వయస్సు. పిల్లలను పెంచేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పోలీసుల సహకారంతో కొత్తపల్లిలోని స్పందన అనాథాశ్రమంలో చేర్పించారు. అప్పటి నుంచి వారు ఆశ్రమంలోనే ఉంటూ ఇద్దరూ చదువుకుని పెద్దవారు అయ్యారు. ప్రస్తుతం పూజ డిగ్రీ ఫైనల్ ఇయర్, బన్ని ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఈ నెల 4న సత్ప్రవర్తన కింద ప్రభుత్వం సారయ్యను విడుదల చేసింది. ఆశ్రమంలోని పిల్లల వద్దకు వచ్చిన తండ్రి పిల్లలను చూసి ఉద్వేగానికి గురయ్యాడు. వారిని దగ్గరకు తీసుకుని కన్నీటి పర్యంతం అయ్యాడు. పూజ, బన్నిలను స్పందన ఆశ్రమ నిర్వాహకులు గోపరాజు వీరస్వామి తండ్రికి అప్పగించాడు.

బెట్టింగ్ యాప్స్ నిర్వాహకుల అరెస్టు

- రూ.33 లక్షలు, కారు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు

సుల్తానాబాద్, జూలై 5: బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తూ యువత నుంచి లక్షల రూపాయలను కొల్లగొడుతున్న ముఠాను సుల్తానాబాద్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి 33 లక్షల పది వేల రూపాయల నగదుతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమారు తెలిపిన వివరాల ప్రకారం.. సీపీ ఆదేశాల మేరకు పెద్దపల్లి డీసీపీ, ఏసీపీ, సుల్తానాబాద్ సీఐల పర్యవేక్షణలో సుల్తానాబాద్ ఎస్ఐలు శ్రావణ్‌కుమార్, నరేష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీలో భాగంగా ఓ కారును తనిఖీ చేయగా రూ.33 లక్షల నగదు పట్టుబడింది. కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ముల్కల రాజేశ్, చిన్నపల్లి అభిలాష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళంకు చెందిన నిమ్మల ధనుంజయ్‌లు ముఠాగా ఏర్పడి 55 క్లబ్, తిరంగా యాప్, 82 లాటరీ తదితర ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తూ యువకుల నుంచి లక్షలాది రూపాయలు లూటీ చేస్తున్నారు. బెట్టింగ్ యాప్‌ల ద్వారా వచ్చిన డబ్బులను తీసుకుని హైదరాబాద్ నుంచి గోదావరిఖని వస్తుండగా పోలీసులకు చిక్కారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్య

సుల్తానాబాద్, జూలై 5: సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కనుకయ్య(50) అనే రైతు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం పాల్పడ్డాడు. ఆరేళ్ల కనుకయ్య 34 గుంటల భూమిని కౌనుగోలు చేయగా, లక్షల రూపాయల వరకు అప్పు అయ్యింది. రెండేళ్ల క్రితం కనుకయ్య చిన్న కుమారుడు రాజ్‌కుమార్‌కు యాక్సిడెంట్ కావడంతో చికిత్స కోసం మూడు లక్షల వరకు అప్పు అయ్యింది. మొత్తం నాలుగు లక్షల అప్పు కావడంతో అదే తీర్చేందుకు కనుకయ్య ప్రస్తుతం హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పు తీర్చలేననే బాధతో గురువారం పురుగుల మందు తాగగా, శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్ తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్ క్రైం, జూలై 5: కూతురుకు వివాహం జరగడం లేదని మనస్తాపంతో మద్యానికి బానిసగా మారి పురుగుల మందుతాగిన గణేశ్‌నగర్‌కు చెందిన తోట వెంకటేశ్వరరావు(55) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఒకటో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 26న ఇంటిలో మద్యంలో పురుగుల మందు కలిపి తాగగా కుటుంబసభ్యులు వెంకటేశ్వరరావును కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

సారంగాపూర్,జూలై, 5 : మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన పీసు ప్రవళిక(36) అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతూ గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల మేరకు ప్రవళికకు అదే గ్రామానికి చెందిన పీసు తిరుపతి రెడ్డితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే తిరుపతి రెడ్డి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నారు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి పడుకుంది. అందరూ నిద్రో ఉన్న సమయంలో ఇంట్లోనే ఉరివేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తల్లి బద్దం మాధవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలిక ప్రసవం

● ఓ యువకుడు మోసం చేశాడని తల్లి ఫిర్యాదు

● కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సైదాపూర్, జూలై 5: సైదాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) పెళ్లి కాకుండానే ప్రసవించి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. తల్లిదండ్రులకు వ్యవసాయ పనులకు చేదోడు వాదోడుగా ఉంటూ పనికి వెళ్తుండేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వరుసకు బావ అయ్యే యువకుడు(17) ఆమెపై అత్యాచారానికి పాల్పడంతో బాలిక గర్భం దాల్చింది. ఈ నెల 1న వరంగల్ ఎంజీఎంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బాలిక తల్లి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

ఎండపల్లి, జూలై 5: మండలంలోని గుళ్లకోట గ్రామంలో తాటి చెట్టుపై నుంచి కింద పడడంతో గీత కార్మికుడికి గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామంలో మూల లచ్చయ్య గౌడ్ గీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు లాగే శుక్రవారం కూడా తాటిచెట్టు ఎక్కాడు. పైకి ఎక్కాక మోకు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న గౌడ సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి సత్యం గౌడ్ చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించి జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

మహిళపై కోతుల దాడి

బీర్‌పూర్, జూలై 5: బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన మహిళపై శుక్రవారం కోతులు దాడి చేసి గాయపరిచాయి. బీర్‌పూర్ గ్రామానికి చెందిన చిర్నేని రమునా అనే మహిళ తన ఇంటి వద్ద పనులు చేసుకుంటుండగా చెట్టుపైన ఉన్న కోతులు ఒకే సారిగా కిందకు దూకి దాడి చేసి గాయపరిచాయని బాధిత మహిళ తెలిపింది. కోతులతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఇంట్లో దూరి వంట సరుకులు చిందరవందరగా చేస్తూ ఇంటి పై కప్పులు తొలగిస్తున్నాయని వాపోయింది. అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

సిరిసిల్ల చేనేత అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

» హైదరాబాద్‌లో రూ. 100 కోట్లతో ప్రత్యేక మాల్ ఏర్పాటుకు యత్నం

» 35 మంది యువ పారిశ్రామికవేత్తలతో వెలిచాల రాజేందర్‌రావు భేటీ

» మిల్లుల ఆధునికీకరణ, ప్రింటింగ్, డైయింగ్ మిషన్‌లపై చర్చ


యువ పారిశ్రామికవేత్తలతో చర్చిస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్/సిరిసిల్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడం, చేనేత రంగ అభివృద్ధి కోసం విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేశామని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే విధంగా తాను కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన 35మంది చేనేత కుటుం బాలకు చెందిన యువ పారిశ్రామిక వేత్తలు శుక్రవారం వెలిచాల రాజేందర్‌రావును కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి లోతుగా చర్చించారు. వీరంతా ఇంజనీరింగ్, డిగ్రీ పూర్తి చేసిన యువ పారిశ్రామిక వేత్తలు. యువకుల ఆలోచనకు అనుగుణంగా నవతరం దృక్పథంతో నవీన పద్ధతుల్లో ముందుకు వెళ్లాలని ఆలోచనతో రాజేందర్‌రావును కలిసి వారి ఆలోచన లను తెలిపారు. వీరిలో 10 మంది 10 రోజులు తమిళనాడులో వస్త్ర పరిశ్రమలకు ప్రసి ద్ధిచెందిన తిర్పూర్, కోయంబత్తూర్, సేలం లాంటి పట్టణాలను సంద ర్శించి 10 రోజులు అక్కడే వస్త్ర పరిశ్రమ గురించి అవగాహన చేసుకున్నారు. వెలిచాల రాజేందర్‌రావు ఎన్నికల సమయంలో సిరిసిల్ల విజన్ డాక్యుమెంట్ తయారుచేసి, యువ పారిశ్రామికులతో రోడ్ మ్యాప్ కోసం వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ వచ్చే వారం సిరిసిల్లలో మరోసారి సమావేశమై దీనికి తుది రూపు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ తరువాత హైద్రాబాద్లో టెక్స్‌టైల్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, టెక్స్‌టైల్ కమిషనర్ అలుగు వర్షిణి, మంత్రి పొన్నం ప్రభాకర్, శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలువనున్నట్లు తెలిపారు. ఆ తరువాత వారంలో ముఖ్యమంత్రిని కలిసి సిరిసిల్ల చేనేత రంగం అభివృద్ధిపై విజన్ డాక్యుమెంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. దీంతో పాటే తాను తయారు చేసిన సిరిసిల్ల వీవర్స్ విజన్ డాక్యుమెంటును కూడా ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే విషయాన్ని సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు తెలిపారు. వస్త్రవిహార్ పేరుతో హైదరాబాద్‌లో ఒక అదునిక మాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం రూ. 100 కోట్ల క్యాపిటల్‌తో ముఖ్యమంత్రితో మాట్లాడతానని రాజేందర్‌రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు అందించి సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమకు వచ్చే స్కీములు, సబ్సిడీలు, గ్రాంట్లు ఇంట్రెస్ట్‌ఫ్రీ లోన్స్ సాధించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో గోవింద్ శ్రీకాంత్, దూడం శ్రీకాంత్, భానుచందర్, వంశీకృష్ణ, సతీష్, ప్రవీణ్, శ్రీరాం, భరత్, కోమాకుల మల్లికార్జున్, వేణుగోపాల్, దూస రమేష్, అడెపు వివేక్, గాజుల సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 5: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌లు శుక్రవారం పట్టుకున్నారు. గండ్రపల్లి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ధర్మారంలో తనుగుల కుఇసుక తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను కొత్తపల్లిలో అదుపులోకి తీసుకున్నారు. వాటికి ఎలాంటి అనుమతి పత్రాలు లేక పోవడంతో మల్లేష్, కుమార్, వెంకటేష్, శ్రీనివాస్, ధనూష్, అరవింద్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

వీణవంక: చల్లూరు గ్రామంలోని మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. డ్రైవర్ సాగర్, యజమాని ఉండాటి పోచయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూలై 5: శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో శుక్రవారం కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కారు ఢీ కొన్న ఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగట్టుకు చెందిన పల్లె రజిత బావి వద్దకు వెళ్లి వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి తిరి వస్తూ, తన భర్త మహేందర్‌రెడ్డి కోసం కరీంనగర్-వరంగల్ రహదారిపైన రోడ్డు పక్కకు నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హుజూరాబాద్‌కు వెళ్లే కారు రజితను ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయాల య్యాయి. రజిత అపస్మారక స్థితిలోకి చేరింది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందిస్తూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'నీట్'పై సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో శుక్రవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మతం ముసుగులో విచ్ఛిన్నకర శక్తులు కుట్రలు చేస్తున్నాయని వాస్తవాలను వక్రీకరించే విధంగా బీజేపీ ప్రచారం చేయడం దురదృష్టకరం అన్నారు. దేశంలో లక్షలాది మంది వైద్య విద్యార్థులకు చెందిన నీట్ పరీక్ష ప్రహసనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నీట్ పరీక్ష ఏ రాష్ట్రానికి సంబంధించి ఆ రాష్ట్రమే పరీక్ష నిర్వహణ చేసేదని, పారదర్శకత పేరుతో జాతీయస్థాయి పరీక్షగా మార్చి కేంద్రం గుత్తాధిపత్యం తీసుకుందని విమర్శించారు. నీట్ ఎంట్రెన్స్ పరీక్షను నిర్వహించలేని అసమర్థత ఎన్డీయే ప్రభుత్వానిదేనన్నారు. కేంద్రం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు, వాస్తవాలు బయటపడతాయనే ఉద్దేశ్యంతోనే తన పరిధిలో పనిచేసే సీబీఐకి కేసును అప్పగించిందని విమర్శించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సీబీఐతో కాకుండా సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రం వైఫల్యంతో విశ్వాసం సన్నగిల్లి అభద్రత భావన చోటుచేసుకుందన్నారు. పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పూర్తిగా విఫలమైందన్నారు. పరీక్ష లీకేజీపై ఆయా విద్యార్థి సంఘాలు దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిస్తే , దాని దృష్టిని మరల్చేందుకు రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై నిరసన తెలియజేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉపాధి కల్పించేందుకు ఎన్ఆర్ఈజీఎస్‌కార్యక్రమం ప్రవేశపెట్టిందని, దీంతో పాటు అవినీతి రహిత పాలన కోసం సమాచార హక్కు చట్టం, ప్రతి ఒక్కరికీ విద్యను అందించాలనే తలంపుతో విద్యాహక్కు చట్టం, నిరుపేదల కడుపు నింపేందుకు ఆహార భద్రత చట్టాన్ని అమలు చేసిందని, కానీ పదేళ్ల ఎన్డీయే పాలనలో నోట్ల రద్దు, జీఎస్టీ, నిత్యావసర ధరల పెంపు వంటి ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను గమనించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర బాధ్యులు బండ శంకర్, జిల్లా బాధ్యులు గిరి నాగభూషణం, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య, సీనియర్ నాయకులు రాధాకిషన్‌రావు, గుంటి జగదీశ్వర్, నెహాల్ బొల్లి శేఖర్ తదితరులున్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 5: గ్రామస్థాయిలో సీపీఐని బలోపేతం చేస్తూ స్థానిక ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీపీఐ పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాల నిర్మాణం పటిష్టంగా ఉండేదన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, ఆయా జిల్లాల్లో పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసుకో వల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా సంఘాలు నిర్మాణాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రజాసంఘాల పునర్నిర్మాణం చేసుకుని కమిటీలు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేసినట్లయితే స్థానిక ఎన్నికల్లో గెలుపొందే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. సీపీఐ నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, పెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, గోశిక మోహన్, ఆయా జిల్లాలకు చెందిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విలేకరుల పేరిట వసూళ్లు.. ముగ్గురి రిమాండ్

వేములవాడ టౌన్, జూలై 5: విలకరుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డివిజన్ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన సిద్దయ్యకు 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 50 ఏళ్లుగా కాలువ నీటితో సాగు చేసుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన మల్లయ్య అనే వ్యక్తి కాలువను పూడిపి వేసి కింద ఉన్న వ్యవసాయ పొలాలకు సాగు నీరు వెళ్లకుండా చేశాడు. దీంతో కరుణాకర్, నరేష్, ప్రసాద్ అనే ముగ్గురు తాము విలేకరులమని, మల్లయ్యతో మాట్లాడుతామని అందుకు రూ.50 వేలు ఇవ్వాలని సిద్దయ్యను డిమాండ్ చేశారు. దీంతో సిద్దయ్య రూ.15 వేలు అందజేశాడు. కొద్ది రోజులకు మరిన్ని డబ్బులు ఇవ్వాలని అడుగగా సదరు రైతు నిరాకరించాడు. సదరు ముగ్గురు వ్యక్తులు మల్లయ్యతో చేరి సిద్దయ్య పొలానికి వెళ్లే రోడ్డును పూర్తిగా ధ్వంసం చేయించారు. దీంతో సిద్దయ్య కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 1,620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 11.44 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.265 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.330 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

299 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

మానకొండూర్, జూలై 5: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం మానకొండూర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి వరంగల్ నుంచి మహారాష్ట్రలోని నాందేడుకు తరలిస్తున్న 299 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారు. మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బియ్యం లభ్యం కావడంతో పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసి వరంగల్‌కు చెందిన డ్రైవర్ జమీల్, సయ్యద్ హైమద్, క్లీనర్ కుశాల్‌రావు, తడక సతీష్, జన్ను అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పెంపుడు జంతువులతో.. జాగ్రత్త



- వ్యాధులు సంక్రమించే ప్రమాదం
- అవగాహన కలిగి ఉండాలని నిపుణుల సూచన
- నేడు వరల్డ్ జూనోసిస్ డే


జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాలక్షేపం, సరదాగా పెంచుకునే జంతువుల నుంచి సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్‌గా పేర్కొంటారు. వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని నిపుణు లు చెబుతున్నారు. శనివారం వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

● రేబిస్ రాకుండా..

ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొదటి సారిగా 1885 జూలై 6వ తేదీన పిచ్చి కుక్క కాటుకు గురైన బాలుడికి నిరోధక టీకా ఇవ్వడం ద్వారా రేబిస్ వ్యాధి రాకుండా కాపాడగలిగాడు. దీంతో అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం జూలై 6వ తేదీన జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. పెం పుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.

● 200 రకాల వ్యాధులు..

శాస్త్రవేత్తలు, వైద్యుల అంచనాల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు దాదాపుగా 200 రకాల వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతు వుల వల్ల పిల్లలకు ముప్పు ఎక్కువగా ఉంటుంది. కరోనా వైరస్ గబ్బిలాల నుంచి వ్యాపించినట్లు పేర్కొన్నప్పటికీ పూర్తి స్థాయి నిర్ధారణ జరగలేదు. పందుల ద్వారా మెదడు వాపు వ్యాధి, కుక్కల ద్వారా రేబిస్, గొర్రెలు, మే కల ద్వారా ఆంత్రాక్స్, ఆవులు, గేదెల ద్వారా క్షయ, పాలద్వారా బ్రూసె ల్లోసిస్ తదితర వ్యాధులు వ్యాపిస్తాయని వైద్యులు అంటున్నాయి. వ్యాధు లు సోకిన కోళ్లు, గొర్రెలు, జంతువులు, పశువుల మాంసం తిన్నాకూడా మనుషులకు వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది. కుక్కలు తది తరాల మలమూత్రాల వల్ల కూడా వ్యాధులు సంక్రమిస్తాయి. కుక్కలు, పిల్లులను ఒడిలో, సోఫాల్లో, మంచాల్లో కూర్చుండబెట్టినప్పుడు దుస్తుల ద్వారా బ్యాక్టీరియా, వైరస్ వ్యాపిస్తుంది. అన్ని వ్యాధుల్లోనూ రేబిస్ అత్యం త ప్రమాదకరమని వైద్యులు అంటున్నారు. పిచ్చి కుక్కలు మనుషులను, గేదెలను కరవటం పరిపాటిగా మారగా వీటిని నిర్మూలించేలా, వీధి కుక్కలకు సైతం వ్యాక్సినేషన్ చేయాల్సి ఉంటుంది.



అవగాహన అవసరం..

మూగజీవాల పెంపకంలో అవగాహనతో పాటు అప్రమత్తత ఎంతో అవసరం. మనం ఎంతో అభిమానంగా పెంచుకునే కుక్కల నుంచి ర్యాబిస్, గజ్జి, పశువుల నుంచి, గొర్రెలు, మేకల వంటి గడ్డి తినే జంతువుల నుంచి ఆంత్రాక్స్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వ్యాధుల లక్షణాలు గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించి సూచనలు తీసుకోవాలి.

- డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



వ్యాక్సినేషన్ చేయించాలి..

ఇంట్లో పెంచుకునే జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలి. లేకపోతే జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్ర మించే ప్రమాదం పొంచి ఉంది. ఈ వ్యాధులు వ్యాప్తి చెం దకుండా ఉండా లంటూ రెగ్యులర్ వెటర్నరీ వైద్యుల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు పాటించాలి.

- కందుకూరి పూర్ణచందర్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్

● ఇవి పాటిస్తే మేలు..

వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి. కుక్కలను ఉంచే గదులు, కట్టివేసే ప్రాంతాలను సైతం శుభ్రంగా ఉంచాలి. పిల్లలు కుక్క లతో ఆడుకున్న వెంటనే స్నానం చేయించాలి పెంపుడు కుక్కలకు ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరి గా టీకాలు వేయించాలి. పశు వైద్యులు, సిబ్బందిని సంప్రదించి వివరాలను తెలుసుకొని జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అమ్మ ఆదర్శ పనుల అంచనాలు తగ్గింపు

● విద్యార్థుల సంఖ్య ప్రకారం కుదింపు

కథలాపూర్, జూలై 5 : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశ్యంతో సర్కారు అమ్మ ఆదర్శం పథకం కింద నిధులు కేటాయించింది. లోక్‌సభ ఎన్నికల ముందు మౌలిక వసతుల కల్పన కోసం నిధుల మంజూరు చేయగా కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. తదనంతరం మండలంలోని పలు పాఠశాలల్లో రు. 2.13 కోట్ల అంచనాలతో పనులను వేగిరం చేశారు. కాంట్రాక్టర్లతో పంచాయతీరాజ్ ఇంజనీర్లు విద్యుద్దీకరణ, మరుగుదొడ్లు, భవన మరమ్మతులు, తాగునీరు వంటి వసతుల కల్పన పనులను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్యను బట్టి అంచనాలు ఖరారు చేస్తూ జిల్లా ఇంజనీరింగ్ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. గతంలో చేసిన అంచనాల్లో 50 శాతం కుదించి బడ్జెట్‌ను కేటాయించారని సమాచారం. ఈ నేపథ్యంలో మండలంలోని 20 లోపు విద్యార్థులు ఉన్న లంబాడి తండా ఇప్పపల్లి, బీసీ కాలనీ తాండ్ర్యాల, బీసీ కాలనీ గంభీర్‌పూర్, ఎస్సీ కాలనీ కథలాపూర్, పోచమ్మవాడ తక్కళ్లపల్లి, ఎస్సీ కాలనీ దుంపేట, బీసీ కాలనీ బొమ్మెన, కలికోట పాఠశాలల అంచనాలను 50 శాతం మేర తగ్గించారని తెలిసింది. దీంతో ఉత్సాహంగా పనులు చేసేందుకు ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లు ఈ విషయం తెలిసి కుంగుతింటున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్‌ను శుక్రవారం ఆంధ్రజ్యోతి వివరణ కోరగా విద్యార్థుల సంఖ్యకనుగుణంగా కొత్తగా అంచనాలు వేసి ప్రొసీడింగ్‌లు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వెల్గటూర్, జూలై 5: స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం అంటూ తమ స్నేహితుల్లో ఎవరికైనా ఆపద వస్తే ఆదుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు 2008-09 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు. వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు గత సంవత్సరం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆ సమయంలో అందరూ కలిసి 2008-09 ఫౌండేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఫౌండేషన్ ద్వారా తమ స్నేహితులు ఆపదలో ఉంటే ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా గతంలో ఓ స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకొని ఫౌండేషన్ ద్వారా రూ.20 వేలు వైద్య ఖర్చులకు అందజేసి ఆదుకున్నారు. ఇటీవల తమ స్నేహితురాలి భర్త మృతి చెందగా వారి కూతురు పేరు మీద రూ.35 వేలు బ్యాంక్‌లో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్‌ను శుక్రవారం ఆమెకు అందజేశారు. ఈ స్నేహితులు చేస్తున్న సేవా కార్యక్రమాలకు పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కుశనపల్లి రాజేందర్, తరాల్ల అధిక్, రామిల్ల గంగాధర్, ఉపారపు నాగరాజు, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రాజేష్, సతీష్, లలిత, చంద్రకళ, జుబేదా, లావణ్య పాల్గొన్నారు.

యువతికి మహిళా లయన్స్ క్లబ్ ఆర్థిక సాయం



నవ్యకు నగదును అందిస్తున్న మహిళ లయన్స్ క్లబ్ సభ్యులు

కోరుట్ల, జూలై 5 : పట్టణానికి చెందిన అనాద యువతికి కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ సభ్యులు ఆర్థిక చేయూతను అందించి ఉదారత చాటుకున్నారు. కొన్ని రోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మహిళ లయన్స్ క్లబ్ సభ్యులు నగదు ప్రోత్సాహం అందించారు. పట్టణంలోని మోతుకూరి నవ్య తల్లి దండ్రులు కరోనాతో బాధపడుతూ మృతి చెందగా ఒంటరిగా జీవిస్తోంది. నవ్య కొన్ని రోజుల నుంచి గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. చికిత్సకు డబ్బులు లేకపోవడంతో విషయం తెలుసుకున్న కోటి నవదుర్గ మహిళ సంఘ సభ్యులు రూ. 11,500 నగదుతో పాటు నెలకు సరిపోయే కిరాణం సామాను అందించారు. ఈ కార్యక్రమంలో కోటినవదుర్గ మహిళ సంఘ పట్టణ అధ్యక్షురాలు పోతని శ్రీలత - ప్రవీణ్ కుమార్, కార్యదర్శి పోలాస గీత, రిజియన్ చైర్మెన్ పోతని ప్రవీణ్ కుమార్, జోన్ చైర్మన్ అడెపు కమల - మధు, సభ్యులు వనపర్తి రమ్య - చంద్రమోహన్, కుందారపు ప్రేమలత, రుద్ర సుజాత - శ్రీనివాస్,లతో పాటు పలువురు పాల్గొన్నారు.

'విలువలు కలిగిన జర్నలిజంతో సమాజానికి మేలు'



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

మెట్‌పల్లి, జూలై, 5 : విలువలు కలిగిన జర్నలిజంతోనే సమాజం మనుగడ సాధిస్తుందని, సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజలకు చేరవేయడంలో కీలకంగా పత్రికా రంగం ప్రముఖ పాత్ర వహిస్తోందని మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ వర్కింగ్ జర్నలిస్ట్ కోఆర్డినేటర్ చైర్మన్ సౌడాల కమలాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మెట్‌పల్లి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కోఆర్డినేటర్ చైర్మన్ సౌడాల కమలాకర్, న్యాయ సలహాదారుడుగా అలాల శంకర్, సహకోఆర్డినేటర్ మన్నేని వేణురావు, కోరుకంటి విజయ్, ముఖ్య సలహాదారులుగా ఏనుగందుల గోపిగౌడ్, మహమ్మద్ షౌకత్‌అలీ, కోశాధికారిగా ముదాం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అనుపురం సతీష్‌గౌడ్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు శాలువలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ సభ్యులు పాల్గొనారు.

ట్రాక్టర్ ఢీ కొని వృద్ధుడి మృతి

కోరుట్ల రూరల్, జూలై 5 : మండలంలోని సంగెం గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగులపేట గ్రామానికి చెందిన కేతిరెడ్డి మోహన్ రెడ్డి (62) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నాగులపేట గ్రామం నుంచి మోహన్ రెడ్డి తన ద్విచక్ర వాహనంపై కోరుట్లకు బ్యాంకు పని మీద వస్తుండగా కోరుట్ల నుంచి నాగులపేటకు వెలుతున్న ట్రాక్టర్ అతి వేగంతో ఢీ కొట్టింది. సంఘటనలో మోహన్ రెడ్డి తీవ్రగాయాలపాలై ఘటన స్థలంలో మృతి చెందాడు. మోహన్‌రెడ్డి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్ బాబు పరిశీలన జరిపారు.

గిరిజన తండాల్లో సమస్యలు పరిష్కరించాలి

కథలాపూర్, జూలై 5 : మండలంలోని గిరిజన తండాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం బంజారా నేతలు తహసీల్దార్ ముంతాజీబోద్దీన్‌కు వినతి పత్రం అందించారు. తండాల్లో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా దరావత్ ప్రకాశ్, రవినాయక్, రాంసింగ్, హర్సింగ్, లోక్యానాయక్, రాజు, సంతోష్, గోపాల్ నాయక్ ఉన్నారు.

మొక్కలను కన్నబిడ్డల్లా కాపాడుకోవాలి



మొక్కలకు నీరు పోస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, జూలై 5 : ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని, నాటిన మొక్కలను కన్నబిడ్డల్లా కాపాడుకోవాల్సిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 75వ వన మహోత్సవ కార్యక్రమాన్ని స్థానిక రామాలయం ఆవరణలో ప్రభుత్వ విప్ ఘనంగా ప్రారంభించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మణ్ కుమార్‌కు అధికారులు, స్థానిక పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో పలు మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెట్లను విరివిగా పెంచడం వల్ల వాతావరణ సమతుల్యం ఉంటుందని, వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు సంవృద్ధిగా పండుతాయని, జంతువులకు, వన్యప్రాణులకు నివాస యోగ్యాలుగా మారతాయన్నారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలను నాటాలని, అవి పెరిగి పెద్దయ్యే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో, సమిష్టిగా పని చేసి విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సాయిబాబా, తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో సురేష్ రెడ్డి, ఏపీఎం త్రివేణి, ఏపీవో వేణు, తాజామాజీ ప్రజా ప్రతినిధులు మున్నుక నిశాంత్ రెడ్డి, గంగాధర్, సత్యానారాయణ, రాజ్యలక్ష్మీతిరుపతి రెడ్డి, పద్మవెంకటేశం, లంబ ధనవ్వలక్ష్మన్, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచే బాధ్యత ప్రతీ ఒక్కరు తీసుకోవాలి

పెగడపల్లి: మొక్కలు నాటి పెంచే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి శాసనసభ్యుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా పెగడపల్లి మండలంలోని లింగాపూర్‌లో శుక్రవారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు స్థానిక నాయకులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా రాష్ట్రాన్ని పచ్చని చెట్లలతో నింపాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయలు వెచ్చించి మొక్కలు పంపిణీ, నాటడం జరుగుతుందన్నారు. మొక్కలు నాటడం వరకే కాకుండా నాటిన ప్రతి మొక్కను తమ కుటుంబంలో సభ్యుడిగా భావించి పెంచి పెద్ద చేసినపుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. వనమహోత్సవం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి బాధ్యతగా భావించి విరివిగా మొక్కలు నాటి రక్షించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ రావు, ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, ఏపీవో అనీల్, ఏపీఎం సమత, కార్యదర్శి లావణ్య, తాజా మాజీ ఎంపీటీసీ పూసాల శోభాతిరుపతి, కిష్టాపూర్, స్వామిదాస్, శ్రీనివాస్, దుమాల రమేష్, ఈరెల్లి భాస్కర్ పాల్గొన్నారు.



పెగడపల్లి మండలం లింగాపూర్‌లో మొక్క నాటుతున్న అడ్లూరి

● పెగడపల్లి : రాష్ట్రంలో వానలు బాగా కురిసి పంటలు విరివిగా పండాలని, పశుపక్ష్యాదులు చల్లంగా ఉండేలా దీవించాలని కోరుతూ నాయకురాలు నాగమ్మ తల్లిని వేడుకున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఆరవెల్లి గ్రామంలోని నాయకురాలు నాగమ్మ తల్లి ఆలయాన్ని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సందర్శించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు బుర్ర రాములు గౌడ్, ఒరుగల శ్రీనివాస్, సంది మల్లారెడ్డి, కడారి తిరుపతి, భాస్కర్, వంశీదర్ రావు, స్వామి, సత్యనారాయణ రెడ్డి, మురళి, సత్తయ్య, రమేష్ రెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.

అటవీ శాఖ భూమి కబ్జాకు యత్నం

● చెట్లను నరికేసి చదును చేస్తున్న కబ్జాదారులు ● అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, జూలై, 5 : మండలంలో అటవీ భూముల ఆక్రమణదారుల వేటుకు అడవులు కనుమరుగువుతున్నాయి. పంటల సాగు పేరిట ప్రకృతి సంపదైన అటవీ భూములను కబ్జాదారులు కొల్లగొడుతున్నారు. మండలంలో అటవీ విస్తరించి ఉన్న ప్రాంత్రాలపై సమీపంలోని గ్రామాల్లోని కొందరూ ఇప్పటి వరకు అటవీ భూములు కబ్జాలకు పాల్పడినట్లు పలువురు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తామని చర్యలు చేపట్టినప్పటి నుంచి ఆక్రమణదారులు అటవీ భూముల కబ్జాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మండలంలోని రామలచ్చక్కపేట, ఆత్మనగర్ గ్రామాల్లో శివారుల్లోని అటవీ భూమిని అర్ధరాత్రి కొందరు ఆక్రమణదారులు ట్రాక్టర్లతో చదును చేశారు. దీంతో రామలచ్చక్కపేట గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు ఆర్డీవో, తహసీల్దార్, ఫారెస్ట్ కార్యాలయం, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా తండాల సరిహద్దులో అటవీ భూములు ఎక్కువగా కబ్జా అవుతున్నట్లు సమీపంలోని నాయకులు, రైతులు తెలుపుతున్నారు. ఇటీవల మండలంలోని ఆత్మకూర్, పాటిమీదితండా గ్రామాల శివారుల్లో అటవీ భూములను కబ్జా చేయడానికి పలువురు చదును చేసారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడికి వెళ్లారు. కానీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి ఆక్రమదారులు విచ్చల విడిగా అటవీ భూమిని చదును చేస్తున్నట్లు ఆరోపణలు వెలువడు తున్నాయి. ఆక్రమణదారులను అడ్డుకునేందుకు గ్రామాల్లోని నాయకులు వెళ్లిన వారిపై ఎదురు దాడికి పాల్పడుతున్నారనే ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పోడుభూములకు పట్టాలు ఇస్తారనే ఆశ్యాశకు పోయి అటవీ భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని పలువురు తెలుపుతున్నారు. అటవీ భూములను ఎవరైనా కబ్జా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలకే పరిమితమైవుతున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీల నాయకులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అటవీ భూములను కాపాడాలని అధికారులను కోరుతున్నారు.



ఆక్రమణదారులు చదును చేసిన అటవీ భూమి

మొక్కజొన్న పంటల పరిశీలన

రాయికల్, జూలై 5: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ మొక్క జొన్న పంటలను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మొక్కజొన్న పంటల్లో కత్తెర పురుగు, సూక్ష్మదాతు లోపాన్ని గమనించి దానికి తగిన చర్యల గురించి రైతులకు వివరించారు. ఏఈవో రాజేష్, రైతులు అనంత స్వామి, శంకర్, సోమయ్య పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని లింగంపేట గ్రామంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.సురేందర్ మొక్కజొన్న పంటలను పరిశీ లించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మొక్కజొన్న పంటల్లో కత్తెర పురుగు, సూక్ష్మదాతు లోపాన్ని గమనించి దానికి తగిన చర్యల గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయధికారి చంద్ర దీపక్, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నరేష్

కొడిమ్యాల, జూలై 5 : ఎమ్మార్పీఎస్ కొడిమ్యాల మండల అధ్యక్షుడిగా మండలంలోని శనివారంపేట గ్రామానికి చెందిన బండారి నరేష్‌ను నియామకం చేసి జిల్లా ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దుమాల గంగారాం, సురుగు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జెంకి సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు బోనగిరి కిషన్, సురేందర్, సందీప్, శేఖర్, రాజేందర్, మల్లేష్, అజయ్, నర్సయ్య పాల్గొన్నారు.

జాతీయ యువజన ఉపాధ్యక్షుడిగా చోళేశ్వరా చారి

గొల్లపల్లి, జూలై 5 : గొల్లపల్లి మండలం రాఘవ పట్నం గ్రామానికి చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారుడు, కవి, రచయిత గాలిపెల్లి చోళేశ్వరా చారి కళావేదిక జాతీయ యువజన ఉపాధ్యక్షులుగా శుక్రవారం నియమితులయ్యారు. ఈ మేరకు చోళేశ్వరా చారిని నియమిస్తూ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ ఉత్తర్వులు జారీ చేశారు. సూక్ష్మకళాకారుడిగా, కవిగా, రచయితగా, సైకతశిల్పిగా ప్రతిభను కనబరుస్తూ నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న చోళేశ్వరా చారిని జాతీయ యువజన ఉపాధ్యక్షులుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా చోళేశ్వరా చారిని గ్రామస్థులు అభినందించారు.

ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి తోకల రాజేశ్వర్

మెట్‌పల్లి, జూలై, 5 : ముదిరాజ్‌ల కులానికి చెందిన ప్రజాప్రతినిధుల పట్ల హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరును తప్పుగా ఒప్పుకొని క్షమాపణలు చెప్పాలని ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి తోకల రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో నిర్వ హించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన మీటింగ్‌లో ముదిరాజ్ బిడ్డ గీకు రవీందర్‌పై అసభ్య పద జాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న ముదిరాజ్ బిడ్డ ఈటెల రాజేందర్‌పై ఇదే విధంగా అవమాన కరమైన వ్యాఖ్యలు చేయడంతో పాటు ముదిరాజ్ కులానికి చెందిన పత్రిక విలేకరిని కిడ్నాప్ చేసి హింసించి ఘటనాలను ఖండించారు.

ముదిరాజ్‌లపై వ్యవహరిస్తున్న తీరుపై వెంటనే క్షమాపణలు తెలిపాలి లేనియెడలా రాష్ట్రంలోని ముదిరాజ్‌లు నిరసన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, వెలుముల రాం బాబు, అంజయ్య రాజన్న, రమేష్, సత్యనారాయణ, విజయ్, నర్సయ్య, శ్రీనివాస్, చిన్నయ్య, హన్మండ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి తోకల రాజేశ్వర్

బదిలీపై వెళ్తున్న ఫీల్డ్ ఆఫీసర్‌కు సన్మానం

కొడిమ్యాల, జూలై 5 : మండల కేంద్రంలోని యూని యన్ బ్యాంక్ నుంచి బదిలీపై వెళ్తున్న ఫీల్డ్ ఆఫీసర్ సాగ రిదేవ్‌గిర్‌ను శుక్రవారం సాయంత్రం బ్యాంక్ మేనేజర్, సిబ్బంది మహిళా వీవోల ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. నూతనంగా వచ్చిన ఫీల్డ్ ఆఫీసర్ గజానంద్ గంగాధర్‌సర్వాడకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సంజీవ్‌కుమార్, డిప్యూటీ మేనేజర్ రాజు, ఏపీఎం రాజేష్, సీసీలు వీరకుమార్, మంగ, స్వరూప, గోల్డ్ అప్రైజర్ ముమ్మాడి స్వామి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, నాయకులు గంగయ్య బ్యాంక్ సిబ్బంది మల్లేశం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ సత్కారం

రాయికల్, జూలై 5: మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దాసరి రామస్వామి, బందెల శ్రీను, కలువకోట కార్తీక్, సిద్ది గంగరాజం, సామల్ల గంగాధర్, తిరుమలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమ్మెంతల వెంకటర మణి, తాజా మాజీ సర్పంచ్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు చిన్నయ్య, కామని లక్ష్మణ్, సిరిపురం మహేష్, సురేష్, తోట శంకరయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ



గ్రామంలో పర్యటిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి

రాయికల్, జూలై 5: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ సాధ్యమని జిల్లా ఉప వైద్యాధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఒడ్డెలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సీజనల్ వ్యాధుల నివారణ, ప్రత్యామ్నాయ చర్యలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. లోక్యనాయక్ తండా, మంక్యానాయక్ తండాలను పరిశీలించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీరు నిలిస్తే దోమలు వ్యాప్తి చెంది తద్వారా రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి కస్తూరి సతీష్, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి అవారి శ్రీధర్, హెచ్‌ఈవో శ్రీనివాస్, సీహెచ్‌వో ప్రమీల, ఎంపీహెచ్‌ఏ భూమయ్య, ఫార్మాసిస్ట్ దీపిక, స్టాఫ్ నర్సు మౌనిక, ల్యాబ్ టెక్నీషియన్ రాజమణి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

కోరుట్ల రూరల్: పారిశుధ్య పనులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ డివిజన్ అధికారి, మండల ప్రత్యేకాధికారి ఆనంద్ కుమార్ గ్రామ స్థాయి అధికారులు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో డ్రైడే పురస్కరించుకోని పారిశుధ్య పనులను పరిశీలించి గ్రామంలో ఉన్న వార్డుల వివరాలను గ్రామస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇండ్లలో ఉన్న నీటి నిలువలను పరిశీలించి వాటిని తొలగించే విధంగా ఇంటి యజమానులు చొరవ చూపాలని సూచించారు. ఇంట్లో నిలువ నీరు ఉంటే దోమలు విస్తరిస్తాయని తెలిపారు. అంటు వ్యాధులు సోకకుండా గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి అంటు వ్యాధులు నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో నీరజలతో పాటు గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కథలాపూర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు చెల్లించే సర్వీస్ బెనిఫిట్స్‌పై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్‌కు లక్ష రూపాయలు, ఆయాకు రూ. 50 వేల చొప్పున రిటైర్‌మెంట్‌కుగాను చెల్లించడానికి మెమో సం. 1334/ఐసీడీఎస్ ద్వారా మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. 30 ఏప్రిల్ 2024 వరకు 65 ఏళ్లు నిండిన వారి వివరాలు వెంటనే పంపించాలని ఐసీడీఎస్ సీడీపీఓలను ఆదేశించారు. ఎస్‌హెచ్‌టీఎస్-ఈఎంఎస్ డాటా బేస్ జూలై డాటాబేస్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు.

మెట్‌పల్లి రూరల్: వానాకాలంలో వ్యాధులు సోకుండా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కృష్ణవేణి ప్రజలకు సూచించారు. శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా మండలంలోని ఆత్మనగర్‌లో డ్రై డే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శితో కలిసి నిర్వహించారు. మురికి నీరు నిల్వ వల్ల దోమల వృద్ధి చెంది విషజ్వరాలు, అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిల్వ ఉంచకూడదని సూచించారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు వెంకట్రావుపేట, మొగిలిపేట, తదితర గ్రామాల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి గుగ్లావత్ తరుణ్‌కుమార్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో సీటు సాధించినట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ విద్యాసాగర్ తెలిపారు. తరుణ్‌కుమార్ ఇంటర్‌లో (ఎంపీసీ) 912 మార్కులు సాధించాడు. ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో 75 శాతం మార్కులు సాధించి జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో మెటలర్జీ విభాగంలో సీటు సాధించినట్లు తెలిపారు.

కథలాపూర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో పోస్టుల భర్తీలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ టీజీపీఎస్‌సీ కార్యాలయం ముట్టడికి వెళ్తున్నారనే సమాచారం మేరకు కథలాపూర్ బీజేవైఎం నాయకులను ఎస్సై అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు కాశోజి ప్రతాప్, మామిడిపల్లి ప్రవీణ్, ముంజ వెంకటేశ్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన ఎంపీపీఎస్ విద్యార్థులకు ప్రముఖ వ్యాపార వేత్త దాడ హరికృష్ణ-రమ్య దంపతులు రూ 12 వేలు విలువ గల నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం బుగ్గారపు హరీష్ టీచర్లు రొట్టె సరిత, సునీత ఉన్నారు

రాయికల్: మండలంలోని వీరాపూర్ 33 కేవీ లైన్ మెయింటనెన్స్ దృష్ట్యా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నాం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏడీఈ హరీష్ తెలిపారు. కావున ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల, తాట్లవాయి సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

కొడిమ్యాల: కొడిమ్యాల శివారులో శుక్రవారం వ్యవసాయ శాఖ సిబ్బంది పత్తి పంటలను పరిశీలించారు. పత్తి పంటలను క్షేత్ర స్థాయిలో ఆన్‌లైన్ నమోదు చేస్తున్నట్లు రైతులకు తెలిపారు. ఏఈవోలు మంజుల, శ్రీనివాస్, గ్రీష్మ, లావణ్య ఉన్నారు.

రాయికల్: పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ లావుడ్య సంధ్యారాణిసురేందర్ నాయక్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు సన్మానించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నె రాజారెడ్డి, కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

కోరుట్ల: ఏబీవీపీ, బీజేపీ, బీజేవైఎం నాయకులను కోరుట్ల పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పట్టణానికి చెందిన నాయకులను గురువారం రాత్రి నుంచి ముందస్తు అరెస్టులను జరిపారు. శుక్రవారం హైదరాబాదులోని టీఎస్, పీఎస్ కార్యలయ ముట్టడికి నాయకులు వెళ్లకుండా పోలీసు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వారిని అరెస్టులను చేశారు.

కథలాపూర్: ఏక్ పేడ్ మా కా నామ్ (అమ్మ పేరిట ఒక్క మొక్క) అనే నినాదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలువులో భాగంగా మండలంలోని సిరికొండలో శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సిరి మల్లె రాజశేఖర్, వాల్గోట్ ప్రమోద్, కొడిపల్లి అనిల్‌రెడ్డి, ముంజ వెంకటేశ్, మధు ఉన్నారు.

కోరుట్ల: ప్రభుత్వాలు నూతనంగా రూపొందించిన మహిళ చట్టాలపై మహిళ సాధికారత కేంద్రం జగిత్యాల జిల్లా వారు శుక్రవారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సు సాధికారత కేంద్రం జిల్లా ఇన్‌చార్జి అశ్విని చట్టాలపై అవగాహన కల్పించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. న్యాయ కౌన్సిలర్ కటకం రాజేంద్రప్రసాద్, సఖీ కేంద్ర కోఆర్డినేటర్ లావణ్య కళాశాల ప్రిన్సిపల్ రాజులతో పాటు ఉపన్యాసకులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా జాప్యం చేస్తూ మాదిగలకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసిస్తే ఈ నెల 7న వంగపల్లి నిర్వహిస్తున్న దీక్షను విజయవంతం చేయాలని శుక్రవారం కల్లూర్ గ్రామంలో సంబంధించిన పోస్టర్‌ను మాజీ సర్పంచ్ అంజయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.